క్లుప్తంగా

మానవత ఉండి కార్యవర్గం ఎంపిక

ఉండి: మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఉండి మండల శాఖ నూతన కార్యక్రవర్గాన్ని ఎంపిక చేసినట్టు జిల్లా నాయకుడు రుద్రరాజు యువరాజు తెలిపారు. మండల అధ్యక్షుడిగా కట్రెడ్డి సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శిగా పెన్మత్స రామకృష్ణంరాజు, కోశాధికారిగా తిర్లంగి మహేష్‌లను నియమించామని, వీరు శుక్రవారం ఉదయం 10 గంటలకు ఆరేడులో ప్రమాణ స్వీకారం చేస్తారని పేర్కొన్నారు.

ధర్నా చౌక్ ప్రాంగణం ఏర్పాటు చేయాలి

సాక్షి, భీమవరం: ప్రజా సమస్యలు విన్నవించుకునేందుకు కలెక్టరేట్ ప్రాంగణంలో ధర్నా చౌక్ ప్రాంగణం ఏర్పాటు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం గురువారం ఒక ప్రకటనలో కోరారు. దీని కోసం అన్ని రాజకీయ పక్షాలు, ప్రజాసంఘాలతో చర్చించి సూచనలు స్వీకరించాలని పేర్కొన్నారు.

జక్కరంలో పరిశుభ్రతకు ప్రాధాన్యత



జక్కరంలో డ్రెయిన్ పనులు పరిశీలిస్తున్న సర్పంచ్ పద్మావతి

కాళ్ల: గ్రామంలో పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇస్తున్నామని జక్కరం సర్పంచ్ కూచంపూడి పద్మావతి అన్నారు. జక్కరం గ్రామంలో పరిశుభ్రత పనులను గురువారం ఆమె ప్రారంభించారు. డ్రెయిన్‌లో పూడికతీత పనులు చేపట్టారు. కేంద్ర పథకం సత్య సర్వేక్షణ గ్రామీణ పథకానికి జిల్లాలో 15 గ్రామాలు ఎంపికలు కాగా ఇందులో కాళ్ల మండలం జక్కరం గ్రామం ఉన్నట్టు చెప్పారు. గ్రామస్తులకు వ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపట్టామని పద్మావతి చెప్పారు. డ్రెయిన్‌లో పూడికతీత పనులను పంచాయతీ అధికారులు ఉప సర్పంచ్ కూచిపూడి లక్ష్మీపతి రాజు పర్యవేక్షించారు.

పాఠ్యపుస్తకాల పంపిణీ

వీరవాసరం: విద్యార్థులకు సెమిస్టర్–2 పాఠ్యపుస్తకాలు పంపిణీ చేస్తున్నట్టు ఎంఈఓ–1 ఎస్ శ్రీనివాస్ తెలిపారు. స్థానిక ఎంఆర్‌కే హైస్కూల్ స్టాక్ పాయింట్ నుంచి పాఠ్య పుస్తకాలు పంపిణీ గురువారం ప్రారంభించారు. మండలంలో మొత్తం 69 స్కూళ్లు ఉండగా, 63 పాఠశాలలకు పాఠ్య పుస్తకాలు సరఫరా చేశారు. మిగిలిన ఆరు పాఠశాలలకు కొరియర్లో పాఠ్య పుస్తకాలు రానున్నాయి. ఈ పాఠ్య పుస్తకాలను ఉపాధ్యాయులు ఈనెల 22న విద్యార్థులకు అందజేస్తారు. ఉపాధ్యాయులు స్టాక్ పాయింట్ వద్దకు రాకుండా పాఠశాలలకే పాఠ్యపుస్తకాలు అందించేందుకు ప్రభుత్వం విధానం అవలంబిస్తోందని ఎంఈఓ ఎస్ శ్రీమన్నారాయణ తెలిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు జె.శ్రీనివాసరావు, సివిల్ సప్లయిస్ ఆర్‌ఐ సురేష్, సీఆర్పీలు కె.పెద్దిరాజు, కె.ఏడుకొండలు, ఎ.చంద్రశేఖరరావు, వి.సత్యవతి, పీటీఐలు వి.వరప్రసాద్, శ్రీనివాస్, కె.నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వీఆర్‌ఏల వినతి

ఉండి: సమస్యల పరిష్కారం కోరుతూ మండల వీఆర్‌ఏలు ఇన్‌చార్జి తహసీల్దార్ ఎస్వీఎస్ నాయుడుకు గురువారం వినతిపత్రం అందజేశారు. జీతాలు పెంచాలని, అర్హులను వీఆర్వోలు, అండెండర్లుగా పదోన్నతి కల్పించాలని టీఏ, డీఏలు, రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో వీఆర్‌ఏల సంఘ జిల్లా క్యాదర్శి పిల్లి సుబ్బారావు, ఎస్‌కే మెహిద్దీన్, ఎం రాజగోపాలం, ఎం గణేష్, కొవర్తి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పునర్విభజన హామీలు నెరవేర్చాలి

పాలకొల్లు అర్బన్: రాష్ట్ర పునర్విభజనలో భాగంగా కేంద్రం రాష్ట్రానికి ఇచ్చిన హామీలన్నీ తక్షణం నెరవేర్చాలని మాలమహనాడు జాతీయ అధ్యక్షుడు, రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ సెల్ విజిలెన్స్ అండ్ మానటరింగ్ కమిటీ సభ్యులు డాక్టర్ చీకటమిల్లి మంగరాజు డిమాండ్ చేశారు. పాలకొల్లు గాంధీబొమ్మల సెంటర్‌లో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా ఇవ్వాలన్నారు. ప్రత్యేక ప్యాకేజీని పాచిపోయిన లడ్డుతో పోల్చిన పవన్ కల్యాణ్ ప్రస్తుతం టీడీపీ, బీజేపీలకు పొత్తు కల్పాలని మధ్యవర్తిత్వం చేయడం ఎంతవరకు సమంజం? అని మంగరాజు ప్రశ్నించారు. సమావేశంలో మాలమహనాడు జిల్లా అధ్యక్షుడు బొందా మోహనరావు, జిల్లా నాయకులు కోట రత్నంరాజు, వీరవల్లి సునీల్, అరిగెల సత్తిరాజు, కాటిక సురేష్ పాల్గొన్నారు.

స్వచ్ఛ సర్వేక్షణ్‌పై అవగాహన

తాడేపల్లిగూడెం రూరల్: గ్రామాల్లో పారిశుద్ధ్యాన్ని ఖచ్చితంగా అమలు చేయాలని జిల్లా పంచాయతీ అధికారి జీవీకే మల్లికార్జునరావు అన్నారు. గురువారం మండలంలోని ఆరుగొలను సచివాలయంలో స్వచ్ఛ సర్వేక్షణ్–2023పై సమావేశం నిర్వహించారు. డీపీఓ మల్లికార్జునరావు మాట్లాడుతూ వర్షాకాలం దృష్ట్యా చెత్తా, చెదారాలను రోడ్లపై వేయకుండా చూడాలన్నారు. పారిశుద్ధ్య సిబ్బంది ప్రతీ ఇంటి నుంచి తడి, పొడి, చెత్తలను వేర్వేరుగా సేకరించాలన్నారు. బహిరంగ మల, మూత్ర విసర్జన చేయకుండా ప్రజలకు పారిశుద్ధ్యంపై అవగాహన కల్పించాలన్నారు. పారిశుద్ధ్యాన్ని మెరుగుపర్చాల్సిన బాధ్యత పంచాయతీ, సచివాలయ సిబ్బందిపై ఉందన్నారు.

జగన్‌కు ప్రజాదరణ చూసి ఓర్వలేకే విమర్శలు

- చంద్రబాబు, పవన్‌ల కుట్రలు
- ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్

భీమవరం అర్బన్: ప్రతి కుటుంబానికీ మేలు చేయాలనే సదుద్దేశంతో పథకాలు రచించి అమలు చేస్తోన్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజల్లో వస్తోన్న ఆదరణ చూసి ఓర్వలేక చంద్రబాబు, పవన్ కళ్యాణ్‌లు కుట్రలు, కుతంత్రాలు పన్నుతున్నారని ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ ఆరోపించారు. భీమవరం మండలం శ్రీరామపురం, వెంప గ్రామాల్లో గురువారం నిర్వహించిన జగనన్న సురక్ష సభల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. సీఎం జగన్ 98 శాతం హామీలు చేసి ప్రతి కుటుంబానికి రూ.50 వేలు నుంచి రూ.5 లక్షలు వరకు లబ్ధి చేకూర్చారని వివరించారు. 14 సంవత్సరాలు ముఖ్యమంత్రిగా చంద్రబాబు ఏనాడూ పేదలకు మేలు చేయలేదన్నారు. 2014 ఎన్నికల్లో నెరవేరని 600 హామీలను ఇచ్చి తీరా ఓట్లేశాక అధికారం చేజిక్కించుకున్న చంద్రబాబు రాష్ట్ర ప్రజలను మోసం చేశారని గుర్తు చేశారు. ఫలితంగా 2019లో చంద్రబాబును 23 సీట్లకే పరిమితం చేశారని చెప్పారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి 151 సీట్లిచ్చి ఓటర్లు ఘన విజయం చేకూర్చారని తెలిపారు. ఈ సందర్భంగా వెంపలో 2,645, శ్రీరామపురంలో 1,058 ధ్రువ పత్రాలను లబ్ధిదారులకు ఎమ్మెల్యే శ్రీనివాస్ అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ పేరిచర్ల విజయ నరసింహరాజు, జెడ్పీటీసీ కాండ్రేగు నరసింహారావు, ఉభయ గోదావరి జిల్లాల సేవాదళ్ కన్వీనర్ చినిమిల్లి వెంకట్రాయూడు, జాతీయ బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు కోడే యుగంధర్, ఎంపీడీఓ కె. వెంకటలక్ష్మి, సర్పంచ్ కలిదిండి సుజాత, గ్రామ అభివృద్ధి కమిటీ కన్వీనర్ కలిదిండి ఫణిరాజు, సీనియర్ నాయకులు అల్లూరి కృష్ణంరాజు, త్రి సభ్య కమిటీ చైర్మన్ కలిదిండి మురళీకృష్ణంరాజు, అప్పలరాజు, రామచంద్ర రాజు, దాట్ల శ్రీనివాసరాజు, బలరామరాజు, సర్పంచ్ ఇంజేటి రాజేశ్వరి, ఎంపీటీసీలు చిలకపాటి కుమారి, పెన్మెత్స సాయిలక్ష్మి, భాగ్యానందం, కొండేటి లక్ష్మయ్య, సానబోయిన బాపూజీ, సత్యనారాయణ, తిరుమాని పెద్దిరాజు, యేసురత్నం, పెచ్చెట్టి రాము, మండల జేసీఎస్ కన్వీనర్ కోమటి రాంబాబు, నామన మహేష్, కొట్టి కుటుంబరావు, కార్యదర్శి జి.కృష్ణమోహన్ తదితరులు పాల్గొన్నారు.



భీమవరం అర్బన్: వెంపలో లబ్ధిదారులకు ధ్రువ పత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్



భీమవరం(ప్రకాశం చౌక్): 35వ వార్డులో ధ్రువ పత్రం అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి రాజు



ఉండి: కలిసిపూడిలో ధ్రువ పత్రం అందిస్తున్న అధికారులు, నాయకులు

జగనన్న సురక్షతో ప్రజలకు మేలు

భీమవరం(ప్రకాశం చౌక్): జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా ప్రజలకు మేలు చేకూరుతోందని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి ఏఎస్ రాజు అన్నారు. భీమవరం 35వ వార్డులో నిర్వహించిన జగనన్న సురక్ష క్యాంపులో ఆయన పాల్గొన్ని లబ్ధిదారులకు పలు ధ్రువ పత్రాలను అందజేశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నూటికి నూరు శాతం సంక్షేమ పథకాలు ప్రజలకు చేరాలని లక్ష్యంతో పనిచేస్తున్నారన్నారని రాజు అన్నారు. జగనన్న సురక్ష ద్వారా పథకాలు అందుకోలేని వారికి సైతం సంక్షేమ లబ్ధి అందుతుందని చెప్పారు.

- భీమవరం 9వ వార్డులో జరిగిన జగనన్న సురక్ష క్యాంపులో డీసీఎంఎస్ చైర్మన్ వేంద్ర వెంకటస్వామి, పార్టీ జిల్లా మహిళ అధ్యక్షురాలు గూడూరి ఉమాబాల లబ్ధిదారులకు పలు రకాల ధ్రువ పత్రాలను అందజేశారు. అర్హత కలిగి ఉండి కూడా సంక్షేమ పథకాలు అందుకోలేని వారికి జగనన్న సురక్ష పథకం ఓ వరం లాంటిదన్నారు. ఆయా కార్యక్రమాల్లో జేసీఎస్ కన్వీనర్లు గాదిరాజు తాతారాజు, చెల్లబోయిన సూర్యప్రకాష్, నల్లం రాంబాబు, నాయకులు ముల్లి నరసింహమూర్తి, కలిదిండి లక్ష్మీపతిరాజు, రేవూరి గోగురాజు, పాలపర్తి జోనా, ఉమామహేశ్వరరావు, వేంద్ర విజయదుర్గ, కానుబోయిన వెంకటరమణ, పాలవెల్లి మంగ, గంటా సుందర్‌కుమార్, కందికట్ల ఎడ్వర్డ్, అల్లూరి నాగవల్లి, కంతేటి వెంకట్రాజు, ఎండీ బాషా, బొక్కా గోపీ, తదితరులు పాల్గొన్నారు.

అర్తమూరు, కలిసిపూడిలో 2,456 సేవలు

ఉండి: మండలంలోని కలిసిపూడి, అర్తమూరు గ్రామాల్లో గురువారం జగనన్న సురక్ష సభలు నిర్వహించారు. కలిసిపూడిలో 1,245, అర్తమూరులో 1,211 చొప్పున ధ్రువ పత్రాలను అందజేసినట్టు ఎంపీడీఓ అప్పారావు తెలిపారు. ఆయా సభల్లో సర్పంచ్‌లు గోనబోయిన జానకి, శ్రీనివాసరావు, గోనబోయిన వీర్రాజు, ఎంపీటీసీ దంగేటి రామలింగేశ్వరరావు, సచివాలయ కన్వీనర్లు మంగం రవికుమార్, కానుబోయిన సత్యనారాయణ, బాతు రత్నకుమారి, పార్టీ గ్రామ అధ్యక్షుడు బాతు జాన్సన్, ఇన్‌చార్జి తహసీల్దార్ ఎస్వీఎస్ నాయుడు, ఏఓ బి.సంధ్య, ఈవోపీఆర్‌డీ కె.కొండలరావు, సురక్ష మండల కన్వీనర్ బి.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

జగనన్న సురక్ష సభలు



జగనన్న సురక్ష సభలో మాట్లాడుతున్న గూడూరి ఓంకార్

వీరవాసరం: మండలంలోని అండలూరు, బలుసుగొయ్యిపాలెం గ్రామాల్లో గురువారం జగనన్న సురక్ష సభలు నిర్వహించారు. లబ్ధిదారులకు వివిధ ధ్రువ పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ కోటిపల్లి బాల దుర్గా నాగమల్లేశ్వరరావు(బాబు), తహసీల్దార్ ఎం.సుందర్రాజు, ఎంపీడీఓ కె.జ్యోతి, మండల ప్రత్యేక అధికారి బి.సుజాత రాణి, గూడూరు ఓంకారం, ఇళ్ల బాల భారతి, బొల్లెంపల్లి శ్రీనివాస చౌదరి, వి.ప్రవీణ్, గొలగాని సత్యనారాయణ, మానుకొండ ప్రదీప్ కుమార్, కదలి ధర్మారావు, గెడ్డం భాస్కరరావు ఇళ్ల శ్రీనివాస్, చిట్టిబాబు, పంజా సురేష్ తదితరులు పాల్గొన్నారు.

రూ.4.30 కోట్లతో రహదారి నిర్మాణ పనులు

నరసాపురం రూరల్: రహదారుల నిర్మాణానికి అధిక ప్రాధాన్యతను ఇస్తున్నట్టు చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు పేర్కొన్నారు. మండలంలోని పెదమైనవానిలంక గ్రామంలో రూ4.30 కోట్ల నిధులతో నిర్మించనున్న బియ్యపుతిప్ప గ్రామం నుండీ వేములదీవి, చినమైనవానిలంక, పెదమైనవానిలంక, మొళ్లపర్రు సముద్రతీరం వరకూ వెళ్లే సుమారు 12 కిలోమీటర్లమేర రహదారి (ప్రత్యేక మరమ్మత్తులు) నిర్మాణ పనులకు ఆయన గురువారం భూమి పూజ చేశారు. తీరప్రాంత గ్రామాలను అనుసంధానం చేసే ఈ రహదారిని అభివృద్ధి చేయడం వల్ల ప్రజలకు చాలా మేలు జరుగుతుందన్నారు. సారవ నుండీ కరింశెట్టివారిపాలెం వరకూ ఉన్న రహదారి ప్రత్యేక మరమ్మత్తు పనులకు కూడా టెండర్లు పిలిచి ఉన్నామని త్వరలో ఆ పనులు కూడా ప్రారంభిస్తామన్నారు. రానున్న రోజుల్లో వశిష్ట గోదావరి జాతీయ రహదారిని అనుసంధానం చేస్తూ ఈ ఆర్‌అండ్‌బీ రహదారి వెళుతుందని ప్రసాదరాజు వివరించారు. ఈ ఏడాది నరసాపురం నియోజకవర్గంలో రూ.70 కోట్ల నిధులతో 12 ఆర్ అండ్‌బీ రహదారులు నిర్మిస్తున్నామని. నియోజకవర్గంలోని రహదారుల అభివృద్ధికి ఎక్కువ నిధులు మంజూరు చేసుకుని పనులు సకాలంలో పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని ప్రభుత్వ చీఫ్‌విప్ ప్రసాదరాజు అన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలుపుదల

ఆకివీడు: స్థానిక విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో మెయింటినెన్స్ పనుల నిమిత్తం శుక్రవారం విద్యుత్ సరఫరా నిలుపుదల చేయనున్నట్టు ఈఈ పీర్ అహ్మద్ ఖాన్ తెలిపారు. పట్టణ పరిధిలోనూ, దుంపగడప, అజ్జమూరు గ్రామాల్లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

పెదఅమీరం విద్యుత్ సబ్‌స్టేషన్‌లో..

కాళ్ల: పెదఅమీరం విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు, చెట్ల కొమ్మలు తొలగింపు నిమిత్తం శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఈఈ పీర్ అహ్మద్ ఖాన్ తెలిపారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పెదఅమీరం, వేంపాడు, కోపల్లె గ్రామాల్లో విద్యుత్ ఉండదని పేర్కొన్నారు.

పథకాలే జగన్‌ను మళ్లీ గెలిపిస్తాయి

డీసీసీబీ చైర్మన్ పీవీఎల్

కాళ్ల: సంక్షేమ పథకాలే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిని చేస్తాయని డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నరసింహరాజు అన్నారు. కాళ్ల మండలం ప్రాతళ్ల మెరక ఎల్ఎన్ పురం గ్రామంలో గురువారం ఏర్పాటుచేసిన జగనన్న సురక్ష కార్యక్రమంలో పీవీఎల్ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలో ఇప్పటికే అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయని చెప్పారు. ఇంకా మిగిలిన అర్హులకూ అవసరమైన ధ్రువ పత్రాలను జగనన్న సురక్ష ద్వారా పైసా ఖర్చులేకుండా అందజేస్తున్నామని చెప్పారు. ప్రజలకు ఇబ్బందుల్లేకుండా సంక్షేమ పథకాలు అందించాలనే ఆలోచనతో సీఎం జగన్ తీసుకొచ్చిన వలంటీర్ వ్యవస్థపై ప్రతిపక్ష పార్టీలు విమర్శలు చేయడం దారుణమని ఆగ్రహం వ్యక్తం చేశారు. పేదల పక్షపాతి వైఎస్ జగన్‌ను మరోసారి గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా అర్హులకు పీవీఎల్ ధ్రువ పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో ప్రత్యేక అధికారి కిషోర్ కుమార్, సర్పంచులు కంతేటి శ్రీనివాసరాజు, తానంకి నాగరాజు, జెడ్పీటీసీ సభ్యుడు పచ్చిగోళ్ల సోమేశ్వరరావు, ఎంపీపీ పెనుమత్స విశ్వనాథరాజు, కలవపూడి సొసైటీ అధ్యక్షుడు పెనుమత్స దుర్గాప్రసాద్ రాజు, కంతేటి సుబ్బరాజు, వేగేశ్న బాలగణపతి వర్మ, ఎంపీటీసీ సభ్యులు సత్యనారాయణ, బాలాజీ, చంటి రాజు, మైలా శ్రీనివాస్ ఎంపీడీఓ స్వాతి తదితరులు పాల్గొన్నారు.



ప్రాతళ్లమెరకలో ధ్రువ పత్రం అందజేస్తున్న డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నరసింహరాజు

విద్య ప్రతి ఒక్కరికీ జన్మహక్కు



సభలో మాట్లాడుతున్న అఖిలభారత ఉపాధ్యక్షుడు నితీష్ నారాయణ

సాక్షి, భీమవరం: విద్య ప్రతి ఒక్కరికీ జన్మ హక్కుగా ఉండాలని, ఐతే కేంద్ర విద్యను ప్రైవేటీకరించే ఆలోచలు చేస్తున్నట్టు ఎస్ఎఫ్ఐ అఖిలభారత ఉపాధ్యక్షుడు నితీష్ నారాయణ ఆందోళన వ్యక్తం చేశారు. ఎస్ఎఫ్ఐ విద్యార్థి సంగ్రామ సైకిల్ యాత్ర ముగింపు సందర్భంగా గురువారం భీమవరం లాంచీల రేవు సెంటర్‌లో జిల్లా అధ్యక్షుడు పి.వాసు అధ్యక్షతన నిర్వహించిన బహిరంగ సభకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. క్యూబా వంటి దేశాల్లో ప్రాథమిక విద్య నుంచి ఉన్నత విద్య వరకు ప్రజలకు ఉచితంగా అందిస్తున్నట్టు చెప్పారు. అణగారిన వర్గాలకు సైతం ఉన్నత విద్య అందించాలని కోరుతూ ఎస్ఎఫ్ఐ పోరాడుతోందని వివరించారు. రాష్ట్ర కార్యదర్శి ఎ.అశోక్, జిల్లా కార్యదర్శి డి.పెద్దిరాజులు మాట్లాడుతూ ఖాళీగా ఉన్న టీచర్ పోస్టులు భర్తీ చేయాలని, హాస్టల్ విద్యార్థులకు మెస్ చార్జీలు పెంచాలని కోరారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి జి.ధనుష్, ఉపాధ్యక్షుడు జాన్, టి.ప్రసాద్, పి.నాగేంద్ర కుమార్, కె.ఈశ్వర్, బి.గణేష్, జి.శ్రీనివాసు, కె.శాంతి, కె.నవీన్, ఎస్ పవన్, బి.చిరంజీవి, బి.సింధు తదితరులు పాల్గొన్నారు.

యండగండి పీహెచ్‌సీ సేవలపై సంతృప్తి

ఉండి: మండలంలోని యండగండి పీహెచ్‌సీలో అందుతోన్న సేవలపై కేంద్ర బృందం సంతృప్తి వ్యక్తం చేసిందని స్థానిక వైద్యులు తెలిపారు. పీహెచ్‌సీని పాపులేషన్ రీసెర్చ్ సెంటర్ మానిటరింగ్ అధికారి ఎంసీ మాథ్యూస్ ఆధ్వర్యంలో కేంద్ర బృందం బుధవారం సందర్శించింది. పీహెచ్‌సీకి వచ్చే అవుట్ పేషెంట్, ఇన్‌పేషెంట్ సేవలు, మందుల సరఫరా, ల్యాబ్ పరీక్షలు, గర్భిణులు, బాలింతలకు అందుతోన్న సేవలు, వ్యాక్సినేషన్ తదితర సదుపాయాలపై జిల్లా డీపీఎంఓ జి.సుగుణరాజు, జిల్లా స్టాటిస్టికల్ అధికారి ఎం.శరభేశ్వరప్రసాద్ కేంద్ర బృందానికి వివరించారు. ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం ద్వారా ఇంటివద్ద ఉండే బెడ్‌రిడెన్ రోగులకు సేవలు అందిస్తున్నట్టు చెప్పారు. ఏఎన్ఎం, ఆశ వర్కర్ల సేవలను వివరించారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారి డి.బెన్నీసామ్యూల్, డాక్టర్ కీర్తన, వైద్యాధికారులు టి.విజయ్‌కుమార్, ఎం రత్నర్హా, కేవీ రమణ, ఎన్ స్వతంత్రకుమారి, సీహెచ్ అనూష, జి.కళ్యాణి తదితరులు పాల్గొన్నారు.



వైద్యాధికారులతో సమావేశమైన కేంద్ర బృందం

వేగంగా తాడేరు వంతెన నిర్మాణ పనులు

సాక్షి, భీమవరం: భీమవరం శివారులోని గునుపూడి సౌత్ డ్రెయిన్‌పై తాడేరు వంతెన నిర్మాణ పనులు వేగంగా నిర్వహిస్తున్నట్టు ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ అన్నారు. గురువారం వంతెన నిర్మాణ పనులను ఆయన పరిశీలించి మాట్లాడారు. 2019లో శిథిలావస్థకు చేరిన వంతెనపై భారీ వాహనాల రాకపోకలు నిషేధించామన్నారు. సమస్యను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లి రూ.1.90 కోట్లు నిధులు మంజూరు చేయించామన్నారు. ఆ సమయంలో కాంట్రాక్టర్లు ముందుకు రాకపోవడంతో వంతెన నిర్మాణ అంచనాలను రూ.2.30 కోట్లుకు పెంచి నిధులు మంజూరు చేయించినట్టు చెప్పారు. ఎమ్మెల్యే వెంట ఎంపీపీ పేరిచర్ల విజయనర్సింహరాజు, ఆర్‌అండ్‌బీ డీఈ రామరాజు, వైఎస్సార్‌సీపీ నాయకులు చినమిల్లి వెంకటరాయుడు, కోమటి రాంబాబు, గొట్టుముక్కల పద్మరాజు, నామన మహేష్, కోడే యుగంధర్ తదితరులున్నారు.



వంతెన పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్

టెన్త్ స్టడీ మెటీరియల్ పంపిణీ

సాక్షి, భీమవరం: క్రమశిక్షణ, పట్టుదలతో విద్యనభ్యసిస్తే ఉన్నత శిఖరాలను అధిరోహించడం కష్టం కాదని డాక్టర్ బస్వ విజయకృష్ణ విద్యార్థులకు సూచించారు. స్థానిక పొట్టి శ్రీరాములు (పీఎస్ఎం) మునిసిపల్ గరల్స్ హైస్కూల్లో టెన్త్ విద్యార్థులు 230 మందికి సుమారు రూ. 25 వేలు విలువ చేసే స్టడీ మెటీరియల్ గురువారం అరసవల్లి ఈశ్వరమ్మ, వెంకటాచారి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో విజయ కృష్ణ చేతుల మీదుగా అందజేశారు. ట్రస్ట్ అధ్యక్షుడు అరసవల్లి సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ పదో తరగతి విద్యార్థులకు ట్రస్ట్ తరుపున పూర్తి సహకారం అందిస్తున్నామన్నారు. పట్టణంలోని ప్రభుత్వ పాఠశాలల టెన్త్ విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందిస్తున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు జె.సుధారాణి, ఉపాధ్యాయుడు వారణాసి రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ చేస్తున్న దృశ్యం

పౌష్టికాహారంతో ఆరోగ్యకర సమాజం

ఆకివీడు: పౌష్టికాహారంతోనే ఆరోగ్యకరమైన సమాజం ఏర్పడుతుందని ప్రభుత్వం గర్భిణీ, బాలింతలకు, చిన్నారులకు పౌష్టికాహారం సరఫరా చేస్తోందని నగర పంచాయతీ చైర్‌పర్సన్ జామి హైమావతి అన్నారు. స్థానిక గాంధీనగర్‌లోని అంగన్వాడీ కేంద్రంలో గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం గురువారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా హైమావతి మాట్లాడుతూ ప్రభుత్వం సరఫరా చేసే పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో నగర పంచాయతీ వైస్‌చైర్మన్ పుప్పాల పండు, కోఆప్షన్ సభ్యుడు ఎండీ జక్కి, మాజీ ఎంపీటీసీ అంబటి రమేష్, మోటుపల్లి రాజు, ఎండీ మాబూ, అంగన్‌వాడీ కార్యకర్త అల్లాడి ఆదిలక్ష్మి, మహిళలు పాల్గొన్నారు.



స్థానిక గాంధీనగర్‌లో పౌష్టికాహారం అందజేస్తున్న పంచాయతీ చైర్‌పర్సన్ హైమావతి

వలంటీర్లకు అవార్డులతో సత్కారం



వలంటీర్లను సన్మానిస్తున్న దృశ్యం

సాక్షి, భీమవరం: సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేయడంలో వలంటీర్ల సేవలు ప్రశంసనీయమని వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు తోట భోగయ్య అన్నారు. స్థానిక 21వ వార్డు ఎడ్వర్డ్ ట్యాంక్ సచివాలయంలో గురువారం నిర్వహించిన వలంటీర్ల సన్మాన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. వలంటీర్స్ సేవలకు గుర్తింపుగానే మహమ్మద్ వాసిమ్ సేవ వజ్రం, సారిపల్లి శిరీష, బొండా సంతోష్ ఎండీ అజ్రీన్, నంబుల శ్రీదేవి, సంతోష్ కుమారి, ఎండీ భాను, దాసరి కార్తీక్, పుచ్చకాయల అనిల్, ప్రియాంక, రూపా దేవిలకు సేవారత్నం అవార్డులు దక్కాయన్నారు. వీరిని దుశ్శాలువాతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ జంగా మాణిక్యాలరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు పులపర్తి సాయి, పులపర్తి నాగలక్ష్మి, ఎండీ బాబి, ఎండీ బాషా, జంగం సారమ్మ, సచివాలయ సెక్రటరీలు రమేష్, సత్యానందం, శంకరం, శిరీష, నరేష్ పాల్గొన్నారు.

ఎన్నికలకు సిద్ధం కావాలి

తణుకు టౌన్: రాబోయే సార్వత్రిక ఎన్నికలు సిబ్బంది ఇప్పటి నుంచే సిద్ధం కావాలని తణుకు నియోజకవర్గ ఎన్నికల అధికారి జెడ్ వెంకటేశ్వరరావు తెలిపారు. గురువారం తణుకు తహసీల్దార్ కార్యాలయంలో ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమంలో భాగంగా గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల నాయకులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈనెల 21వ నుంచి అగష్టు 21 వరకూ బూత్ లెవెల్ అధికారులు ఇంటింటికి తిరిగి వివరాలు సేకరిస్తారని చెప్పారు. రాజకీయ పార్టీలు బూత్ లెవెల్ ఏజెంట్‌లను నియమించుకుని ఆ జాబితాలను తమకు అందించాలని కోరారు.

కత్తితో దాడి ఘటనపై కేసు

కాళ్ల: పశువుల మేత విషయంలో వ్యక్తిని కత్తితో గాయపరిచిన ఘటనపై కేసు నమోదు చేసినట్టు ఎస్సై ఏజీఎస్ మూర్తి తెలిపారు. పెదఅమీరం గ్రామానికి చెందిన గొరిపర్తి వెంకటసత్యనారాయణ తన నివాస స్థలంలో గేదెల మకాం ఉంది. ఇతని సరిహద్దు స్థలంలో భీమవరం మండలం రాయలం గ్రామానికి చెందిన మల్ల బబ్బులు తన పశువుల కోసం గడ్డి పెంచుతున్నాడు. సత్యనారాయణ ఆవు గడ్డి పాడుచేసిందని, బబ్బులు గేదె సత్యనారాయణ స్థలంలోకి వెళ్లిందనే కారణాలతో వారిద్దరి మధ్యా వాగ్వాదం తలెత్తింది. ఈ నేపథ్యంలో బబ్బులు తన చేతిలో ఉన్న కత్తితో దాడి చేయగా సత్యనారాయణ ఎడమచేతి బొటనవేలుకు గాయమైంది. సత్యనారాయణ వైద్యం నిమిత్తం భీమవరం ప్రభుత్వాసుపత్రిలో చేరాడు. ఆసుపత్రి సమాచారం మేరకు కేసు దర్యాప్తు చేపట్టినట్టు ఎస్సై గురువారం తెలిపారు.

వలకట్ల చోరీపై కేసు

కాళ్ల: చేపలు పట్టుకునే వలకట్ల చోరీపై కేసు నమోదు చేసినట్టు ఎస్సై ఏజీఎస్ మూర్తి గురువారం తెలిపారు. ప్రాతాళ్లమెరక గ్రామానికి చెందిన చేపల వల మేస్త్రి వాతాడి జేజి తన వద్ద ఉన్న వలకట్లను అద్దెకు ఇస్తుంటాడు. ఇటీవల గ్రామానికి చెందిన తిరుమాని సాయి 50 వలకట్లను తనకు చెప్పి అద్దెకు తీసుకువెళ్లాడని, మిగిలిన 11 వలకట్లు కనిపించకపోవడంతో సాయిపై జేజి ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేపట్టినట్టు ఎస్సై మూర్తి తెలిపారు.

వీఆర్‌ఓపై దాడి చేసిన వ్యక్తులపై కేసు

భీమవరం అర్బన్: భీమవరం రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో గురువారం వీఆర్‌ఓపై దాడి చేసిన వ్యక్తులపై పోలీసులు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేశారు. కొమరాడ వీఆర్‌ఓ పెంటయ్య సచివాలయం పక్కన ఉన్న ఇళ్లవారు చెత్త ఎందుకు వేస్తున్నారని అడిగినందుకు బుధవారం అడబాల రమేష్, పాలనాటి క్రాంతి, తులపుల వినయ్ కుమార్, ముచ్చెర్ల నాగరాజు, మరో వ్యక్తి దాడి చేసి దుర్భాషలాడారు. పెంటయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు హెడ్ కానిస్టేబుల్ కె.వెంకటరెడ్డి తెలిపారు.

నిత్యావసరాల అందజేత

పాలకొల్లు సెంట్రల్: బ్యాంక్ ఆఫ్ ఇండియా విశేష సేవలందిస్తూ ఖాతాదారుల్లో ఎంతో గుర్తింపు పొందడం జరుగుతుందని మేనేజర్ పి బ్రిజేష్ తెలిపారు. గురువారం బ్యాంక్ ఆఫ్ బరోడా 116వ దినోత్సవం సందర్భంగా రేచల్ ఆర్గనైజేషన్ సంస్థకు నిత్యావసరాలు అందజేశారు.

CHANGE OF NAME

I, Kanumuri Murali Krishnam Raju, S/o. Pedda Subbaraju, Previously Called Kanumuri Murali Krishna Raju (Old Name), Resident of D.No.3-72D, Bhujabalapatnam Village, Kaikaluru Mandal, Krishna District-521340, Andhra Pradesh Now Changed My name from Kanumuri Murali Krishna Raju (old name) to Kanumuri Murali Krishnam Raju (New Name). Today onwards use my new name for all further transactions.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
భీమవరం డివిజన్
90102 23729
Office mail : tpgadvt@gmail.com